క్లుప్తంగా

పరిహారం ఓ బూటకం

ఖమ్మం సహకారనగర్: పంట నష్టంపై ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఓ బూటకమని కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు పెట్టిన పెట్టుబడిలో కనీసం సగం కూడా కాకుండా రూ.10వేల పరిహారమే ప్రకటించడం సరికాదన్నారు. కాగా, సీఎం కేసీఆర్‌కు కౌలు రైతులపై ప్రేమ ఉంటే రైతుబంధు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు.

రైతులకు కేంద్ర ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల వడగళ్ల వానలతో పంట నష్టపోయిన రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేలు ఆర్థిక సాయం అందించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడగా నాయకులు తాతా భాస్కరరావు, దుగ్గి కృష్ణ, శీలం పకీరమ్మ, సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, ఎస్‌కె మీరా తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

తిరుమలాయపాలెం: రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరితమైన పర్యటనలు చేసి రైతులను మరోసారి మోసం చేస్తున్నాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం పార్టీ మండల జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి రమేష్, వీరస్వామి, నాగయ్య, వెంకటేశ్వర్లు, బ్రహ్మాచారి, మల్సూర్, షబ్బీర్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ సభ్యత్వ రద్దు అనైతిక చర్య

నేలకొండపల్లి: సూరత్ కోర్టు తీర్పును సాకుగా చూపి రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయటం అనైతికమని కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

తిరుమలాయపాలెం: రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం బీజేపీ కుట్రపూరిత చర్య అని రాష్ట్ర జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్ ఖండించారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో ఆయన మాట్లాడుతూ... ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ పట్టం కట్టే రోజు దగ్గరలోనే ఉందన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై వివాదం

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బీఆర్.అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పాఠశాల వద్ద విగ్రహం ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం చేశారు. ఇటీవల శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. కాగా మురుగు కాల్వపై నిర్మాణం చేయడంపై మరో వర్గం అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల వారు అధికారులకు ఫిర్యాదులు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లికి చెందిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన డి.సైదులు(21) శుక్రవారం పురుగుల మందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు నేలకొండపల్లిలో చికిత్స చేయించాక ఖమ్మం తరలించారు. ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

నగరంలో ఇంటింటికీ టీడీపీ

ఖమ్మంఅర్బన్: ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని శుక్రవారం నగరంలోని 13వ డివిజన్‌లో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మేడ శ్రీనివాస్, వడ్డే విజయ్ పాల్గొని సభ్యత్వ నమోదు కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే, 29న హైదరాబాద్‌లో జరగనున్న టీడీపీ ఆవిర్భావ వేడుకలకు హాజరుకావాలని కోరారు. సీతయ్య, వెంకన్న, నాగేశ్వరావు, బాబురావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

యుద్ధభేరి మోగించాలి

రఘునాథపాలెం: ఎస్సీ వర్గీకరణను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి పిలుపునిచ్చారు. మాదిగల సంగ్రామ పాదయాత్రకు మండలంలోని పంగిడి వద్ద స్వాగతం పలికారు. వెంకటేశ్వర్లు, అంజయ్య, గాజుల నరసింహారావు, రాము, జనార్దన్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని హరిశ్చంద్రాపురం గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతురాజు, అభయాంజనేయ స్వామి దేవతల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోరం కనకయ్య పూజలు నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, అచ్చయ్య, రాందాస్, ప్రసాద్, సుశీల, సాంబ పాల్గొన్నారు.

కొత్త జీపీల్లో 'ఉపాధి' ఇక్కట్లు

- ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో జాప్యం
- ఉన్న వారిపైనే అదనపు భారం
- పాలేరు నియోజకవర్గంలో 33 జీపీలకు ఎఫ్‌ఏల లేమి



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

నేలకొండపల్లి: వలసలను నివారించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా పనుల నిర్వహణ కోసం ప్రతీ గ్రామపంచాయతీకి ఉపాధి హమీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించింది. ఇంతవరకు బాగానే ఉన్నా... నాలుగేళ్ల క్రితం ఏర్పడి కొత్త జీపీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవటంతో ఉన్నవారిపైనే అదనపు భారం పడుతుంది. ప్రస్తుతంపాత పంచాయతీల్లో పనిచేసే వారే కొత్త పంచాయతీల్లో పనులను పర్యవేక్షిస్తుండగా.. పారదర్శకత లోపిస్తోందనే విమర్శలు ఉన్నాయి.

పాలేరులో 33 కొత్త జీపీలు..

పాలేరు నియోజకవర్గంలో కొత్తగా 33 గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. వీటిలో క్షేత్ర సహాయకులు లేక పాత పంచాయతీలో ఉన్న సిబ్బందే పనులు పర్యవేక్షిస్తున్నారు. ఫలితంగా ఉన్న వారిపైనే భారం పడి, పనికి న్యాయం చేయలేకపోతున్నామని వాపోతున్నారు. నేలకొండపల్లి మండలంలోని ఆరు, తిరుమలాయపాలెంలో 12, కూసుమంచిలో 11, ఖమ్మం రూరల్‌లో నాలుగు కొత్త జీపీలు ఏర్పడగా.. ఉపాధి హమీ పథకం పనుల పర్యవేక్షణకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకోవడంతో పనులు సజావుగా సాగటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఉన్న వారిలోనే కొందరు భారం మోయలేక రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

కూలీల సంఖ్య పెంచడం ఎలా?

జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకం ఉద్యోగులు ప్రతీ గ్రామంలో జాబ్ కార్డు కలిగిన వారందరికీ పని కల్పించాలి. ప్రతీరోజు కూలీల సంఖ్య పెంచడం, పనుల పర్యవేక్షణ, వేతనాలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవడం తదితర విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. కానీ రెండు, మూడు పంచాయతీలు ఒక క్షేత్ర సహాయకుడు ఉండడంతో ఇబ్బంది మారిందంటున్నారు. కొన్నిచోట్ల మేట్‌లకు అప్పగించటంతో వారు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో తప్పిదాలు జరుగుతున్నాయి. అంతే కాకుండా రెండు, మూడు పంచాయతీల్లో పనిచేసినా భారం పెరుగుతుందే వేతనాలు పెరగడం లేదనే ఆవేదనలో ఎఫ్‌ఏలు ఉన్నారు.

ప్రతీ జీపీలో నియమించాలి..



ప్రతీ పంచాయతీకి ఒక క్షేత్ర సహాయకులు ఉంటేనే కూలీలకు న్యాయం జరుగుతుంది. ఒక్కొక్కరికి రెండేసి జీపీల బాధ్యతలు కేటాయించడంతో ఇబ్బందిగా ఉంటుంది. ఉన్న వారిపై భారం పడి సక్రమంగా పనిచేయలేకపోతున్నారు. తద్వారా కూలీలు నష్టపోతున్నారు.

– పి.నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు

అదనపు వేతనం అందించాలి



రెండేసి పంచాయతీల్లో అదనపు పనులు చేస్తున్న క్షేత్ర సహాయకులకు వేతనాలు కూడా అదనంగా చెల్లించాలి. అదే విధంగా మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. న్యాయమైన సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే మాకు సైతం న్యాయం జరుగుతుంది.

– తిగుళ్ల భాస్కర్, కోనాయిగూడెం, ఎఫ్‌ఏ

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి



కొత్త గ్రామపంచాయతీల్లో క్షేత్ర సహాయకులు నియామకం విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం కొత్త జీపీల్లోనూ పాత పంచాయతీల ఎఫ్‌ఏలతో పని చేయిస్తున్నాం. కొత్తగా ఏం చేయాలన్నా ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం.

– కె.జమలారెడ్డి, ఎంపీడీఓ, నేలకొండపల్లి

'పల్లె ప్రగతి'లో తెలంగాణ ఆదర్శం

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఉత్తమ సర్పంచ్‌లకు అవార్డుల ప్రదానం



గ్రామ పాలకవర్గానికి అవార్డు అందజేస్తున్న మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: గ్రామాల్లో పల్లెప్రగతి ద్వారా చేపడుతున్న పనులతో ఆదర్శంగా తీర్చిదిద్దిన తెలంగాణ.. దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. రఘునాథపాలెం మండలంలో 15పంచాయతీలకు పురస్కారాలు దక్కడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. కేంద్రప్రభుత్వం దీనదయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ స్వశక్తి కిరణ్ పురస్కారాలను ప్రకటించగా, రఘునాథపాలెంలోని రైతు వేదికలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు మంత్రి పురస్కారాలు అందజేసి మాట్లాడారు. తెలంగాణలోని ప్రతీ పల్లె పచ్చదనంతో కళకళలాడుతోందని.. ప్రభుత్వం నిధులు కేటాయిస్తుండడంతో పాటు ప్రవేశపెడుతున్న పథకాలే ఇందుకు కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, జెడ్పీటీసీ ప్రియాంక, ఎంపీపీ భూక్యా గౌరి, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ నర్సింహారావు, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, సుడా చైర్మన్ విజయ్‌కుమార్‌తో పాటు గుత్తా రవి, వీరునాయక్, మద్దినేని వెంకటరమణ, అఫ్జల్, భూక్యా లక్ష్మణ్‌నాయక్, మందడపు సుధాకర్, పిన్ని కోటేశ్వరరావు, మాధంశెట్టి హరిప్రసాద్, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, గొర్రె శ్రీను, తోట వెంకట్, ఉప్పెర్ల కొండలరావు పాల్గొన్నారు.

ముస్లింలు సుఖ సంతోషాలతో ఉండాలి

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం మామిళ్లగూడెం: రంజాన్ పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆకాంక్షించారు. ఖమ్మం 57వ డివిజన్ రెహమాన్ నగర్ మజీద్‌లో మంత్రి.. ముస్లింలతో కలిసి నమాజ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఉపవాస దీక్ష ఆచరించనున్న పేద ముస్లింకు మజీద్ ఆధ్వర్యాన బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కాగా, ఖమ్మం 53వ డివిజన్ హలీమా ఖతుం మజీద్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు కూడా మంత్రి హాజరయ్యారు. ఇక ఖమ్మం 55వ డివిజన్ బ్యాంకు కాలనీలకి చెందిన రిటైర్డ్ ఎమ్మార్వో గుంటుపల్లి వేణుగోపాల్‌రావు తండ్రి కృష్ణయ్య(102) మృతి చెందగా, ఆయన కుటుంబీకులను మంత్రి పరామర్శించారు.



ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం వైరారోడ్: బీఆర్‌ఎస్ అనుబంధ అంబులెన్స్ కార్మిక విభాగం పోస్టర్లను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు, టెక్నీషియన్ల కమిటీ ఆవిర్భావంలో ఆయన పాల్గొని పోస్టర్లు ఆవిష్కరించాక అధ్యక్షుడు చింతల వినయ్ తదితరులను అభినందించారు. ఈకార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు క్లైమెంట్, జ్యోతిరెడ్డి, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సిటీ లైబ్రరీ చైర్మన్ ఆశ్రిఫ్‌తో పాటు తాజుద్దీన్, షంషుద్దీన్, మౌసిన్, ఫారూక్, వలీ, పరశురాం, పాల్వంచ కృష్ణ, పాషా, లింగాల రవి, మేకల సుగుణరావు, సిల్వరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సెర్ప్ ఉద్యోగులు



ఖమ్మం సహకారనగర్: కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: సెర్ప్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు వేతన స్కేల్ వర్తింపచేయటంపై జిల్లా సెర్ప్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ శుక్రవారం ఐడీఓసీలోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ, మరింత బాధ్యతగా, మెరుగ్గా పనిచేసి శాఖకు మంచిపేరు తేవాలన్నారు. డీఆర్డీఓ విద్యాచందన, ఏపీడీ జయశ్రీ, డీపీఎం రేవతి, దర్గయ్య, సెర్ప్ యూనియన్ల అధ్యక్షులు చిన్న వెంకటేశ్వర్లు, నరేందర్ రెడ్డి, సుభద్ర, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తిరుమలరావు, పుల్లారావు, రాయల శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: డీఆర్‌డీఏ సెర్ప్ ఎంప్లాయిస్ జేఏసీ ఉద్యోగులు శుక్రవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింప చేయడంపై మంత్రిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు కొండపురెడ్డి నరేందర్‌రెడ్డి, గంగుల చిన్న వెంకటేశ్వర్లు, కంద్రాతి వెంకటేశ్వర్లు, నాగ పుల్లారావు, వెంకట రామారావు, తిరుమలరావు, పెద్దపాక వెంకటేశ్వర్లు, హరికృష్ణ పాల్గొన్నారు.

నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్



జ్ఞానలత

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం సుగ్గల వారితోట ప్రాంతానికి చెందిన రెంటాల జ్ఞానలతకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. 'ఆబ్జెక్టివ్ ఆఫ్ టీచింగ్ ఇంగ్లిష్ ఇన్ ఇండియా' అంశంపై ప్రొఫెసర్ కనకదుర్గ పర్యవేక్షణలో ఆమె సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. జ్ఞానలత డిగ్రీ వరకు ఖమ్మంలో చదవగా, ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ, ఎంఫిల్ హైదరాబాద్‌లో పూర్తిచేశారు.

అభయ వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్‌కాలనీలోని శ్రీ అభయ వేంకటేశ్వర స్వామి దేవాలయ 19వ వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం సుదర్శనహోమం తదితర పూజలు ఉంటాయని దేవాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మేకల వీరన్న, గుగులోత్ మణికంఠలు తెలిపారు. గౌరవాధ్యక్షుడు జెల్లి కొండలరావు, ప్రచారకార్యదర్శి పురం తిరపతయ్య, కార్పొరేటర్ కార్యవర్గ సభ్యుడు దండా జ్యోతిరెడ్డి, బొల్లి కొమరయ్య, సత్యం, సుబ్బాచారి, గణేష్, సూర్యం, మల్సూర్, వీరబాబు, అంజయ్య, చంద్రయ్య, వెంకన్న, వీరయ్య, విజయ, సాలమ్మ, నాగేశ్వరరావు భక్తులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి

నేలకొండపల్లి: వడ్డెరలను ఎస్టీ జాబితాలోకి మార్చాలని తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు పరుశురాం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వడ్డెరలు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుంచం ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి బొంత గోవింద్, మండలాధ్యక్షుడు బండి మల్లేష్, ఉపేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణ దినోత్సవం

ఖమ్మంరూరల్: క్షయవ్యాధిని నివారించవచ్చని, టీబీ అంతం మన పంతం అనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని ఎం. వెంకటాయపాలెం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్షయా నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీపై అవగాహన కల్పించారు. సిబ్బంది విజయకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఇద్దరు వ్యాపారుల మృతి



శిరం గణేష్ (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ సీనియర్ సభ్యుడు, గాంధీచౌక్ సెంటర్ వ్యవస్థాపక సభ్యుడు శిరం వినాయక హన్మంతరావు(గణేష్) (84) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఖమ్మం మార్కెట్‌లో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడమే కాక, గాంధీచౌక్ సెంటర్ ఏర్పాటులో గణేష్ కుటుంబ సభ్యులు కీలక పాత్ర పోషించారు. ఈమేరకు ఆయన మృతదేహం వద్ద పలువురు నివాళులర్పించి భార్య, ఇద్దరు కుమారులను పరామర్శించారు. ఇక ఖమ్మం గుట్టలబజార్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం సభ్యుడు, వ్యాపారి నూనె శ్రీనివాసరావు(57) శుక్రవారం తన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, గణేష్, శ్రీనివాసరావు మృతదేహాల వద్ద చాంబర్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు చిన్ని కృష్ణారావుతో పాటు తూములూరి లక్ష్మీనరసింహారావు, పెనుగొండ శ్రీనివాసరావు, డాక్టర్ కడవెండి వేణుగోపాల్‌రావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, అర్వపల్లి నిరంజన్, అర్వపల్లి అశోక్, కడవెండి శ్రీనివాస్‌రావు తదితరులు నివాళులర్పించారు.

రాములోరి కల్యాణానికి ఆహ్వానం

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల రామాలయంలో ఈ నెల 30న జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కలెక్టర్ వీపీ గౌతమ్, నగర కమిషనర్ ఆదర్శసురభిలకు వేడుకల బాధ్యులు ఆహ్వానపత్రికలను శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో చావా నారాయణరావు, జశ్వంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి స్థల వితరణ



నగదు అందజేస్తున్న ఎంపీపీ, దాత

కూసుమంచి: మండలంలోని గోరీలపాడుతండాలో రామాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జక్కేపల్లి సొసైటీ చైర్మన్ నలబోలు చంద్రారెడ్డి వితరణ చేశారు. స్థల కొనుగోలుకు రూ.2.70 లక్షలు ఆలయ కమిటీ బాధ్యులకు ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్‌తో అందజేశారు. శ్రీనివాస్ నాయక్, చోటి నాయక్, గోపి, శంకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ్ పక్షోత్సవాలు

పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలు శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్షోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలను ప్రదర్శించారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పలువురు అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: చిరుధాన్యాల ప్రదర్శన..



రఘునాథపాలెం: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్, టీచర్లు



నేలకొండపల్లి: బుద్ధారం అంగన్‌వాడీ కేంద్రంలో..

సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం



ఖమ్మంరూరల్: లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందాళ

ఖమ్మంరూరల్: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేదని ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం 50 జీఓ కింద పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. అదే విధంగా 70 మందికి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఎంపీపీ బెల్లం ఉమా, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు పంచాయతీ బిల్లులు..

నేలకొండపల్లి: పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఈ నెలాఖరు నాటికి చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ పంచాయతీ అవార్డులను ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అందజేశారు. సర్పంచ్, ఎంపీటీసీ, కార్యదర్శులకు సన్మానించారు. ప్రశంసాపత్రంతో పాటు షీల్డ్‌ను అందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, చెరుకు అభివృద్ధి మండలి చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్, మండల పంచాయతీ అధికారి శివ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

తిరుమలాయపాలెం: జాతీయ అవార్డుల పురస్కారాల కార్యక్రమంలో భాగంగా మండలంలో ఎంపికైన ఎంపికైన ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, సెక్రటరీలనుఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సన్మానించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ పంపిణీ చేశారు. తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ జయరాం, ఎంపీపీ మంగీలాల్, వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి ఎంపీఓ రాజేశ్వరి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కూసుమంచి: జీఓ నంబర్ 58, 59 కింద మండలంలో మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పురస్కారాలు సాధించిన పంచాయతీల పాలకవర్గాలను సన్మానించారు.

ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: రైతులకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రాన్ని అడగకుండా ఎకరానికి రూ.10వేలు ఇస్తానన్న కేసీఆర్ ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల్లో కేంద్రం వాటా ఎంతో చెప్పాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ... బీజేపీ కిసాన్‌మోర్చా పోరాట ఫలితంగానే ప్రగతి భవన్ వీడి కేసీఆర్ రైతుల వద్దకు వచ్చారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్ర ప్రదీప్, నున్న రవికుమార్, శ్యామ్ రాథోడ్, కిరణ్, ఉపేందర్ గౌడ్, మందా సరస్వతి, చంద్రశేఖర్, ఎల్లారావు, శ్రీనివాసరావు, వెంకట్, పసుమర్తి సతీష్, డీకొండ శ్యామ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రఘునాథపాలెం: ఇటీవల మృతి చెందిన మండలంలోని బూడిదంపాడు గ్రామ కాంగ్రెస్ కార్యకర్త గుడిబండ్ల నరేష్ కుటుంబాన్ని శుక్రవారం నాయకులు పరామర్శించి రూ.15,000 ఆర్థిక సాయం, క్వింటా బియ్యం అందజేశారు. నర్సింహారావు, వార్డు సభ్యులు మంద గోపి, నామ ప్రశాంత్ , కూరపాటి మధు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో ఇటీవల నిర్వహించిన ఝాన్సీ కళామహోత్సవ్‌లో వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో తెలంగాణ నుంచి పలువురు కళాకారులు పాల్గొనగా ఖమ్మంకు చెందిన రవి కూడా హాజరై ప్రదర్శన ఇచ్చి సన్మానం అందుకున్నారు. ఈ సందర్భంగా రవిని నగరానికి చెందిన కళాకారులు అభినందించారు.

కట్టలమ్మ చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు



చెరువు కట్టను పరిశీలిస్తున్న డీఈఈ, అధికారులు

నేలకొండపల్లి: కట్టలమ్మ చెరువును అభివృద్ధి చేసేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఇరిగేషన్, మండల పరిషత్, పంచాయతీ పాలకవర్గం అధికారులు సందర్శించారు. ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.10 కోట్లలో నేలకొండపల్లి కట్టలమ్మ చెరువు అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివ, సర్పంచ్ రాయపూడి నవీన్‌లు చెరువు కట్ట ను సందర్శించారు. ఈ మేరకు కట్టపై ఉన్న పందుల గుడిసెలను తీసేయాలని గుడిసెవాసులకు తెలిపారు. కానీ తమ జీవనోపాధి పందులు తాము తీసేది లేదని వారు తేల్చి చెప్పారు. చెరువు కట్టపై రెయిలింగ్, పెన్సింగ్, గ్రీనరీ, జంగిల్ క్లియరెన్స్, తూటికాడ తొలగింపుతో పాటు దాదాపు 400 మీటర్ల వరకు కాలిబాట అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో గుడిసెలు తీయకుంటే పనులు చేయటం కష్టమని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.